# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- గుజరాత్ లోని సోమనాథ్ జ్యోతిర్లింగ ఆలయంలో నిర్వహిస్తున్న "సోమనాథ్ అమృత్ మహోత్సవం"లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు.

- విదేశీ మారకద్రవ్యం అవసరమయ్యే వస్తువులపై ఖర్చును తగ్గించుకోవాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పిలుపునిచ్చారు.

- ఢిల్లీలో వచ్చే నెల అంతర్జాతీయ బిగ్ క్యాట్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్ తెలిపారు.

- ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

సోమనాథ్ కేవలం ఒక ఆలయం మాత్రమే కాదని, దేశపు అలుపెరుగని స్ఫూర్తికి అది ఒక నిదర్శనంగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. చారిత్రక సోమనాథ్ ఆలయం పునర్ నిర్మాణం జరిగి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో ఈరోజు నిర్వహించిన సోమనాథ్ అమృత్ మహోత్సవ్‌లో నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... శిథిలావస్థ నుండి పునరుద్ధరణ వరకు సోమనాథ్ ఆలయ ప్రయాణం దేశ అజేయమైన వారసత్వాన్ని, నాగరికతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. పోఖ్రాన్ అణుపరీక్షలను గుర్తు చేస్తూ... భారతదేశ దృఢమైన రాజకీయ సంకల్పానికి ఇది ప్రతీక అని అన్నారు. సోమనాథ్ అమృత్ పర్వ్ కేవలం ఒక పండుగ కాదని, రాబోయే వెయ్యేళ్లు భారతదేశానికి స్ఫూర్తి అని చెప్పారు. భారతదేశాన్ని అణిచివేసే శక్తి ప్రపంచంలో మరేదేశానికి లేదని ప్రధానమంత్రి స్పష్టం చేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పులుల ఆవాసాల పునరుద్ధరణ, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ, సామూహిక పరిరక్షణకు కార్పొరేట్ నిధులు ఎంతో అవసరమని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పులుల పరిరక్షణ ప్రయత్నాలకు పారిశ్రామిక వేత్తలు  మద్దతు ఇవ్వాలని కోరారు. పులి, సింహం, చిరుత, మంచు చిరుతతో సహా ఏడు ప్రధాన పులుల జాతుల రక్షణ కోసం, అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ ఆధ్వర్యంలో వచ్చే నెల 1, 2వ తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలో తొలి అంతర్జాతీయ "బిగ్ క్యాట్ సమ్మిట్"ను భారత్ నిర్వహించనుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో, జీవవైవిధ్యం, నీటి వనరులను పరిరక్షించడంలో పులులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. వాతావరణ రంగంలో భారతదేశం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ... పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యంలో దేశం ఇప్పుడు ప్రపంచంలోని 3వ స్థానంలో ఉందని, ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం సౌర విద్యుత్ సామర్థ్యం 150 గిగావాట్లకు చేరుకుందని భూపేందర్ యాదవ్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ రంగాల బలోపేతానికి పరిశోధనలు, ఆవిష్కరణలు ఎంతో ముఖ్యమని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అన్నారు.  న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "ప్రయోగశాల జంతు సంక్షేమం: విధానాలు, ఉత్తమ పద్ధతులు" అనే జాతీయ సదస్సులో ఆయన ప్రసంగిస్తూ... శాస్త్రీయ ప్రయోగాలలో ఉపయోగించే జంతువుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. జంతు ప్రయోగాల నియంత్రణ పర్యవేక్షణ కమిటీ (CCSEA), విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, పరిశోధనా సంస్థలలోని జంతు ప్రయోగా సౌకర్యాలను నియంత్రించడంలో.. పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దేశంలో పెరుగుతున్న ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ సామర్థ్యాలను కేంద్రమంత్రి ప్రస్తావిస్తూ... పరిశోధన, జెనరిక్ మందులు,  వ్యాక్సిన్ ఉత్పత్తిలో ప్రపంచానికి భారత్ ఒక ప్రధాన కేంద్రంగా ఆవిర్భవించిందన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ – రోజ్‌గార్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీజీ రామ్ జీ)  చట్టం ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా అమలులోకి రానుంది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో 125 రోజుల వేతన ఉపాధికి హామీ ఇచ్చే ఈ చట్టం గ్రామీణ భారతదేశానికి సాధికారత కల్పిస్తుందని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశ వ్యాప్తంగా ఈ కొత్త విధానాన్ని అమలు చేయడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 95 వేల 692 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ.) 2005 స్థానంలో వచ్చిన వికసిత్ భారత్ జి.ఆర్.ఎ.ఎం.జి. చట్టం ప్రధాన లక్ష్యం వేగవంతమైన గ్రామీణాభివృద్ధికి మద్దతు ఇవ్వడం, అధిక ఆదాయ భద్రతను కల్పించడం, గ్రామీణ కుటుంబాలకు సాధికారత కల్పించడం. నిర్దేశించిన సమయంలోగా పని కల్పించకపోతే... నిరుద్యోగ భృతిని కూడా ఈ కొత్త చట్టం అందిస్తుంది. మహిళా కార్మికుల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి, ఐదేళ్లలోపు వయస్సు గల ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నచోట, వారి సంరక్షణ కోసం ఒక మహిళా కార్మికురాలిని నియమించడం ఈ చట్టంలోని ఒక ముఖ్య నిబంధన. దీని ద్వారా మహిళలు ఎలాంటి అంతరాయం లేకుండా తమ పనిని కొనసాగించడానికి వీలు కల్పించడంతో పాటు, పని ప్రదేశాలను వారి అవసరాలకు మరింత అనుకూలంగా, సమ్మిళితంగా మార్చేందుకు ఉద్దేశించబడింది.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితుల దృష్ట్యా.. విదేశీ మారకద్రవ్యం అవసరమయ్యే వస్తువులపై ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పౌరులకు, వ్యాపార సంస్థలకు పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ...

పశ్చిమాసియాలో సంఘర్షణలు కొనసాగుతున్నాయని, కాల్పుల విరమణకు మరింత సమయం పడుతుందని, అందువల్ల దేశం ఆర్థిక రంగంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం చాలా ముఖ్యమని అన్నారు. తమ దైనందిన జీవితంలో విదేశీ మారక ద్రవ్య వ్యయాన్ని తగ్గించుకోగల రంగాలను పౌరులు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. అటువంటి వ్యయాన్ని తగ్గించడంతో పాటు, విదేశీ మారక ద్రవ్య ఆదాయాన్ని కూడా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి ఈ రెండు ప్రయత్నాలు ఏకకాలంలో జరగాలని అశ్వినీ వైష్ణవ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల వన్డే వార్షిక ర్యాంకింగ్స్‌లో భారత్ జట్టు 118 పాయింట్లతో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. సౌతాఫ్రికా 102 పాయింట్లతో నాలుగవ స్థానానికి చేరుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన ఢిల్లీ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =

కేరళం, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు, రేపు ఉరుములు, మెరుపుతో కూడిన వడగళ్ల వానలు కురుస్తాయని పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వివరించింది. రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల్లో ధూళి తుఫానులు సంభవించే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, పంజాబ్‌లలో ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని, బీహార్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాలలో కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులే ఉంటాయని ఐఎండీ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =